

## నేడు పాలక మండలి సమావేశం


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి గురువారం సమావేశం కానుంది.



## నిమ్మకాయల ధరలు

తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మ కాయలు ధర కనిష్ట ధర రూ.2,500 , గరిష్ట ధర రూ.4,700 , మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.

## కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

## న్యూస్‌రీల్

### నేడు 17 మందికి కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: 1998 డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా మినిమం టైం స్కేల్‌పై పని చేసేందుకు అంగీకరించిన అభ్యర్థులకు గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు డీఈఓ పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి 17 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను deognt. blogspot. com లో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాలో పేర్లు పొందుపర్చిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, డీఎస్సీ–98 హాల్ టిక్కెట్‌తో హాజరు కావాలని సూచించారు.

### గురజాల డీఎస్పీగా పల్లపురాజు



గురజాల: గురజాల సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా పల్లపురాజు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన బెజవాడ మెహర్ జయరాం ప్రసాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. పల్లపురాజు దిశ పోలీస్ స్టేషన్ ఒంగోలు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా గురజాలకు బదిలీ అయ్యారు.

### జాబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్




చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన జాబ్ పోర్టల్‌ను కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మూడో సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఈ జాబ్‌పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ఈ జాబ్ పోర్టల్‌లో ఉన్నత విద్యతో అనుసంధానమైన వివిధ కంపెనీలు రిజిస్టరై ఉంటాయన్నారు. ఇంటర్న్‌షిప్‌తో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న తర్వాత వారి విద్యార్హతలకు అనుగుణంగా కంపెనీ ఇంటర్వ్యూకు ఎంపిక అవుతారన్నారు. కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం ఇంటర్న్‌షిప్ చేస్తున్న 80 మంది విద్యార్థినులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. కళాశాల విద్య అధికారులు శ్రీధర్, కవిత, ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

### 1,14,895 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,10,068 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,14,895 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,562 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.70 అడుగుల వద్ద ఉంది. ఇది 154.2455 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.2203 టీఎంసీలకు సమానం.

# అద్వితీయం.. విజయకేతనం

చదువుల ఖిల్లాగా పేరొందిన ఉమ్మడి గుంటూరు జిల్లా ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర మొత్తం సరాసరి ఉత్తీర్ణతశాతం కంటే అధికంగా సాధించి రికార్డు సృష్టించింది. ఈ సారి సైతం బాలురకంటే బాలికలే ఉత్తీర్ణతలో ముందంజలో నిలిచారు. గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నమోదైన రెండు సంవత్సరాల ఫలితాలను పరిశీలిస్తే ప్రస్తుత ఏడాదే అత్యధిక ఉత్తీర్ణత నమోదవడం విశేషం. విద్యాశాఖాధికారులు అత్యంత పకడ్బందీగా, విజయవంతంగా పరీక్షలు నిర్వహించగా.. పరీక్షలు ముగిసిన 22 రోజుల్లోనే కట్టుదిట్టంగా మూల్యాంకనం నిర్వహించి, ఫలితాలు వెల్లడించడం గమనార్హం.

- ఇంటర్ ఫలితాల్లో ఐదేళ్లస్థాయిలో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు
- సీనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిచిన ఉమ్మడి గుంటూరు జిల్లా
- జూనియర్ ఇంటర్‌లో 3వ స్థానం కైవసం
- రెండేళ్ల ఫలితాల్లోనూ పైచేయి సాధించిన బాలికలు
- జూనియర్ ఇంటర్‌లో 68 శాతం, సీనియర్ ఇంటర్‌లో 78 శాతం ఉత్తీర్ణత
- సీనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయి సగటు కంటే అధికంగా ఉత్తీర్ణత శాతం



ఇంటర్మీడియెట్ విద్యార్థినుల చిద్విలాసం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో సగటు ఉత్తీర్ణత శాతాన్ని అధిగమించారు. మార్చి నెలలో జరిగిన ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాల పరీక్షల ఫలితాలను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేశారు. రెండేళ్ల ఫలితాల్లోనూ బాలురను అధిగమించిన బాలికలు అత్యధిక ఉత్తీర్ణతతో పైచేయి సాధించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ జవాబు పత్రాలకు మూల్యాంకనం నిర్వహించడంతో పాటు పరీక్షలు ముగిసిన 22 రోజుల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో ఫలితాలను ప్రకటించింది.

ప్రథమ సంవత్సర పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 72 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 68 శాతంగా నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో 61శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 78 శాతంగా నమోదైంది. రెండేళ్ల ఫలితాల్లోనూ ఎంపీసీ, బైపీసీ విభాగాల వారీగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులను కైవసం చేసుకుని సత్తా చాటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఐదేళ్లలో నమోదైన రెండేళ్ల ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలను పరిశీలిస్తే ప్రస్తుత ఏడాది అత్యధిక ఉత్తీర్ణత నమోదైంది.

### ప్రథమ సంవత్సర ఫలితాలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రథమ సంవత్సర పరీక్షలకు హాజరైన 46,210 మంది విద్యార్థుల్లో 31,403 మంది ఉత్తీర్ణులయ్యారు. 68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి గుంటూరు జిల్లా 3వ స్థానంలో నిలిచింది. బాలురు 23,412 మంది పరీక్షలు రాయగా వారిలో 15,184 మంది ఉత్తీర్ణులయ్యారు. 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా 22,798 మంది బాలికలు పరీక్షలు రాయగా, 16,219 మంది ఉత్తీర్ణులయ్యారు. 71 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

### ద్వితీయ సంవత్సరం..

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన 39,481 మంది విద్యార్థుల్లో 30,783 మంది ఉత్తీర్ణులయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రస్థాయిలో ఉమ్మడి గుంటూరు జిల్లా 2వ స్థానంలో నిలిచింది. బాలురు 20,220 మంది పరీక్షలు రాయగా వారిలో 15,110 మంది ఉత్తీర్ణులయ్యారు. 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే విధంగా 19,261 మంది బాలికలు పరీక్షలు రాయగా వారిలో 15,673 మంది ఉత్తీర్ణులయ్యారు. 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

**గత ఐదేళ్లలో నమోదైన ఉత్తీర్ణత శాతం**

| సంవత్సరం | ఉత్తీర్ణత శాతం |
|---|---|
| ప్రథమ సంవత్సరం | |
| 2017-18 | 65 |
| 2018-19 | 63 |
| 2019-20 | 65 |
| 2020-21 | ఆల్ పాస్ |
| 2021-22 | 63 |
| ద్వితీయ సంవత్సరం | |
| 2017-18 | 76 |
| 2018-19 | 74 |
| 2019-20 | 66 |
| 2020-21 | ఆల్ పాస్ |
| 2021-22 | 68 |

### ఫస్టియర్ ఎంపీసీలో స్టేట్ ఫస్ట్..

బాపట్ల అర్బన్: ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో బాపట్లకు చెందిన గండూరి భవ్య ఎంపీసీలో 467 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించింది.

### పల్నాడు విద్యార్థుల సత్తా..

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రామిరెడ్డిపేట శ్రీచైతన్య కళాశాలకు చెందిన సయ్యద్ అబ్దుల్‌కరీం బైపీసీ ప్రథమ సంవత్సరం విభాగంలో 440 మార్కులకు గాను 437 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించాడు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కోమటినేని శివాని 1000 మార్కులకు గాను 991 మార్కుతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. చిలకలూరిపేట శ్రీచైతన్య కళాశాల విద్యార్థిని షేక్ ఆరీఫా సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 990 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఎంపీసీ ఫస్టియర్‌లో యేనుగుల లక్ష్మీ తులసి 465 మార్కులతో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించింది.

## ఏడాదిలో ఒక్కసారే నిజరూప దర్శనం

- పురాతన ఆలయంలో సనాతన ఆచారం
- సొలస గ్రామంలో భూసతమే రంగనాయకస్వామి దేవస్థానం



నిజరూప దర్శనమిచ్చిన రంగనాయకస్వామి

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న భూసమేత రంగనాయక స్వామి దేవస్థానం బుధవారం స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఏడాదిలో ఒకరోజు మాత్రమే స్వామివారి నిజరూప దర్శనం ఉంటుందన్నారు. స్వామివారి కల్యాణం వేడుకలకు నాలుగు రోజులు ముందుగా మూలవిరాట్‌కు పూర్తి అలంకారాలను తొలగించి నిజరూప దర్శనం భక్తులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మరుసటి రోజు వేకువజామునే పంచామృత అభిషేకాలు కొనసాగుతాయన్నారు. నిత్యం ఉత్సవమూర్తులకు ఎన్నో రకాల అభిషేకాలు చేస్తామని, మూలవిరాట్‌కు మాత్రం ఏడాదిలో ఒకరోజు మాత్రమే అభిషేకాలు ఉంటాయని వెల్లడించారు. దీంతో నిజరూప దర్శనం, మూలవిరాట్‌కు జరిగే అభిషేకాలను దర్శించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నిజరూప దర్శన కార్యక్రమం ముగియగా, గురువారం అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తర్వాత స్వామివారు సర్వాంగ సుందరంగా అలంకారకృతుడై భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.

## అబద్ధాలు చెప్పటంలో చంద్రబాబు దిట్ట

పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గుంటూరు రూరల్: అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయటంలో చంద్రబాబు ఆరితేరిన వాడని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి చేసి ఓటమిపాలైన వాళ్లు తనపై ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు.

టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ 2014 నుంచి 2019 వరకు పెదకూరపాడులో రూ.1100 కోట్లతో అభివృద్ధి చేశానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ రూ.1100 కోట్లతో ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. జగనన్న సంక్షేమ పాలనలో తాను నాలుగేళ్లలో రూ.1377 కోట్లతో సంక్షేమ పథకాలు, రూ.655 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని వాటి లెక్కలు చెప్పేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ హయాంలో ఇసుక తవ్వకాల వల్ల 28 మంది అమాయక ప్రజలు చనిపోతే చంద్రబాబు ఆ పాపం తనకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ రూ.100 కోట్లు ఫైన్ వేసింది టీడీపీ హయాంలోనే అన్న విషయం చంద్రబాబు మర్చిపోయారన్నారు. ఇటీవల అమరావతి మండలంలో ఇద్దరు చనిపోవడానికి కారణం మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి చేసిన ఇసుక తవ్వకాల వల్లేనని చెప్పారు. అమరావతి – బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు తాము వేస్తున్నామని, అమరావతి – తుళ్లూరు రోడ్డు తామే వేస్తున్నామని చెప్పారు. ఇవన్నీ గతంలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పెద మద్దూరు బ్రిడ్జి నిర్మాణ పనులు కనిపించలేదా అని ప్రశ్నించారు. అలాగే కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు తెచ్చి త్వరలో నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. చంద్రబాబు అమరావతి పర్యటన పెద్ద ఫ్లాప్ అని జనం రాకపోవడంతో ఫ్రస్టేషన్‌లో విజ్ఞత మర్చిపోయి మాట్లాడారన్నారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## బాబు సభ వెలవెల

- సత్తెనపల్లి పర్యటనలో కనిపించని జనం
- జనం లేకపోవడంతో ఆలస్యంగా సభాస్థలానికి వచ్చిన బాబు
- 'కోడేళ్ల' శివప్రసాద్ అనడంతో విస్మయం వ్యక్తం చేసిన కోడెల అభిమానులు
- రోడ్‌షోలో ఏరులై పారిన మద్యం
- నాలుగు వర్గాలుగా చీలిపోయిన టీడీపీ క్యాడర్

సాక్షి, నరసరావుపేట, సత్తెనపల్లి: ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పేరిట పల్నాడు జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం సత్తెనపల్లిలో జరిగిన చంద్రబాబు సభకు జనం రాకపోవడంతో వెలవెలబోయింది. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కావల్సి ఉన్నా జనం లేకపోవడంతో సుమారు మూడు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభమైంది. సత్తెనపల్లి అసెంబ్లీ టికెట్ కోసం ఇంతమంది ఆశిస్తున్నా జన సమీకరణ మాత్రం అంతంతమాత్రంగానే ఉందని స్థానిక నేతలకు చంద్రబాబు క్లాస్ పీకినట్టు సమాచారం. మరోవైపు ఆలస్యంగా బాబు సభలో ప్రసంగించడం మొదలుపెట్టగానే టీడీపీ అభిమానులు జారుకోవడం కనిపించింది. సత్తెనపల్లిలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ కార్యక్రమాల్లో మద్యం ఏరులై పారింది. పట్టణంలో ఎక్కడ చూసినా టీడీపీ టీషర్టు ధరించిన తెలుగుతమ్ముళ్లు మద్యం తాగుతూ, తాగి రోడ్లపై పడిపోయిన దృశ్యాలు కనిపించాయి. జన సమీకరణ నిమిత్తం ఒక్కో మహిళకు రూ.300 నగదు, పసుపు చీరను పంపిణీ చేశారు. పురుషులకు ఒక్కొక్కరికి రూ.500 నగదు, క్వార్టర్ మద్యం, బిరియానీ ప్యాకెట్టు, టీ షర్టును పంపిణీ చేశారు.

**కోడెళ్ల అనడంతో విస్తుపోయిన కోడెల అభిమానులు...**

మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ పేరును చంద్రబాబు నాయుడు పదే పదే 'కోడెళ్ల ' శివప్రసాద్ అనడంతో ఆయన అభిమానులు విస్మయానికి గురయ్యారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు తన ప్రసంగంలో పదే పదే చంద్రబాబును ముసలోడు కాదు అంటూ అనడం టీడీపీ అభిమానులకు కోపం తెప్పించింది. దీంతో ముసలోడు అనడం ఆపాలంటూ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వెనకనుంచి వారించడం కనిపించింది.

**నాలుగు వర్గాల మధ్య ఆధిపత్య పోరు...**

సత్తెనపల్లి టీడీపీ టికెట్ కోసం నాలుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, కోడెల శివరాం, మన్నెం శివనాగమల్లేశ్వరరావులు పోటాపోటీగా ఫ్లెక్సీలు వేశారు. తమ అధినేతకు ఎవరికి వారు ప్రత్యేకంగా స్వాగతాలు పలికారు. చంద్రబాబు పర్యటనలో ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపించడంతో ఈసారి ఎన్నికల్లో ఈ వర్గపోరుతో ఇబ్బంది పడాల్సి ఉంటుందని టీడీపీ అభిమానులు చర్చించుకోవడం విశేషం.

## జగనన్న వసతి దీవెన ఓ వరం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- కలెక్టరేట్ నుంచి సీఎం కార్యక్రమాన్ని వీక్షించిన జిల్లా కలెక్టర్, లబ్ధిదారులు
- జిల్లాలోని 38,404 విద్యార్థులకు రూ.37.07కోట్లు జమ

నరసరావుపేట: జగనన్న వసతి దీవెన పథకం ద్వారా జిల్లాలోని 38,404 మంది విద్యార్థులకు చెందిన 34,887 మంది తల్లుల ఖాతాలో రూ.37.07కోట్ల భారీ చెక్కును జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. ఈ పథకంలో అర్హులైన లబ్దిదార్లకు అనంతపురం జిల్లా నార్పల నుంచి డీబీటీ ద్వారా నేరుగా డబ్బు జమచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ నుంచి లబ్దిదార్లతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఏటా రెండు వాయిదాల్లో డబ్బులు అందజేస్తుందన్నారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20వేలు పొందుతున్నారన్నారు. జిల్లాలోని 7466 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.7.08కోట్లు, 2480 ఎస్టీ విద్యార్థులకు రూ.2.33కోట్లు, 11,929 మంది బీసీ విద్యార్థులకు రూ.11.46కోట్లు, 9865 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.9.75కోట్లు, 2984 మంది కాపు విద్యార్థులకు రూ.2.90కోట్లు, 3551 ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.3.42కోట్లు, 129 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.0.13లక్షలు లబ్ది చేకూరిందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, సాంఘిక సంక్షేమ అధికారి పి.ఓబులునాయుడు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

## రీసర్వే పనులు 80శాతం పూర్తి : జేసీ



హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

వినుకొండ(నూజెండ్ల): జిల్లాలో 80శాతం రీసర్వే పనులు పూర్తయినట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ సర్వే పనులు పరిశీలనలో భాగంగా వినుకొండ మండలంలోని నరసనాయునిపాలెంలో జరుగుతున్న పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా 106 గ్రామాల్లో ఫేజ్ వన్ కింద 1.96లక్షల ఎకరాలు రీసర్వే పూర్తయిందని, అలాగే జిల్లాలో ఇప్పటివరకు 80శాతం సర్వే పూర్తయి హక్కుపత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. సర్వే ప్రాంతాల్లో 90వేల హద్దురాళ్లను కూడా వేసినట్లు చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పక్కన కలెక్టర్ శివశంకర్, సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండా రెడ్డి

## రైతు సంక్షేమ ప్రభుత్వమిది

- వరికపూడిసెల ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ శివశంకర్, ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల విభజన తర్వాత రైతుల సమస్యలతో పాటు వివిధ విషయాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యవసాయ సలహామండలి పాలకవర్గాన్ని నియమించారని, దీని ద్వారా ప్రతి నియోజకవర్గంలో రైతులకు అవగాహన కల్పించే అవకాశం కలిగిందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లోని పిన్నెల్లి లక్ష్మారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా జిల్లా వ్యవసాయశాఖాధికారులు అనేక చర్యలు తీసుకొని ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చేశారన్నారు. చివరి పంటకు నీరిచ్చేందుకు 6 టీఎంసీల నీటిని ఏప్రిల్ నెలలో కేటాయించేందుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కీలకపాత్ర వహించారని ఆయన చెప్పారు. వరికపూడిసెల ప్రాజెక్టు కోసం ఎంతో కష్టపడి సీఎంను ఒప్పించి సాధించిన సమయంలో నేను జిల్లా కలెక్టర్‌గా ఉండటం ఎంతో ఆనందకరమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, నాలుగు సంవత్సరాలుగా రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పలు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అందులో భాగంగానే ఏడు దశాబ్దాల పల్నాటి రైతుల ఆశాజ్యోతి అయిన వరికపూడిసెలను మంజూరు చేయించి కేంద్రం ద్వారా అనుమతులు తెచ్చారన్నారు. త్వరలోనే సీఎంచే వరికపూడిసెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయించి లక్షలాది రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు చేసే ప్రభుత్వం తమదన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఎంపీపీలు దాసరి చౌడేశ్వరి, బూడిద శ్రీను, జిల్లా హార్టికల్చరల్ అధికారి బెన్ని, డీఎస్‌ఓ వరలక్ష్మి, వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీష్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కాంతారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.

## క్లుప్తంగా

### చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు

**నరసరావుపేట టౌన్:** చెల్లని చెక్కు కేసులో దిగువ కోర్టు విధించిన శిక్షను యథావిధిగా ఖరారు చేస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వి.నాగేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన గర్నెపూడి రాంబాబు వద్ద 2015లో శంకర బాబు రూ.4 లక్షలు అప్పుగా తీసుకొని చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో 2021 ఫిబ్రవరి 19న మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ నిందితుడికి 9 నెలల జైలు, రూ.4 లక్షల పరిహారం ఫిర్యాదుదారుడికి చెల్లించేలా తీర్పు చెప్పారు. తీర్పుపై నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన శిక్షను యథావిధిగా ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

### 30న జిల్లాస్థాయి షటిల్‌బ్యాడ్మింటన్ టోర్నీ

**నరసరావుపేట ఈస్ట్:** సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఈనెల 30న ఆదివారం జిల్లాస్థాయి ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు బుధవారం తెలిపారు. మెన్స్ డబుల్స్, 45సంవత్సరాలు పైబడి, స్థానిక క్రీడాకారుల విభాగాలలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 29లోగా తమ ఎంట్రీలను అందజేయాలని కోరారు. వివరాలకు 9963084143, 9666977722 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### మే 7న గ్రూప్-1, 2 అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు మే 7న ఆన్‌లైన్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు ఉచితంగా గ్రూప్-1, 2కు శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. 91332 37733, 91336 37733 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### గంజాయి బస్తా మాయంపై విచారణ

**మంగళగిరి:** రూరల్ స్టేషన్‌లో గంజాయి బస్తా మాయమైన ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఏఎస్పీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. అనుమానిత గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

# వైఎస్సార్ కళాపరిషత్ నాటికల పోటీలు ప్రారంభం



కొండా శివారెడ్డిని వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

**తెనాలి:** డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి(వైఎస్సార్) నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు బుధవారం రాత్రి స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం జరిగిన ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ.. కళాపోషణ భారం కావటం, తిలకించే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఆంధ్రాప్యారిస్ తెనాలిలో వివిధ పరిషత్‌లు నాటక కళకు ఊపిరి పోస్తుండటం గర్వకారణమన్నారు. మహానుభావుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేరుతో ఏర్పాటైన కళాపరిషత్ నాటకరంగంలో తెనాలికి గల ఖ్యాతిని ఇనుమడింపజేసేలా నాటికల పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ, నాటకాలకు పరిషత్‌లు పునరుజ్జీవం కల్పిస్తున్నాయని చెప్పారు. సభలో ప్రముఖ సినీ దర్శకుడు 'భాగమతి' ఫేమ్ జి.అశోక్‌కు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొండా శివారెడ్డికి వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేసి నిర్వాహకులు సత్కరించారు. దర్శకుడు జి.అశోక్ తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో తెనాలిలో జన్మించి బాలనటుడిగా, కొరియోగ్రాఫర్‌గా, దర్శకుడిగా, ప్రస్తుతం హిందీ రంగంలో కొనసాగుతున్న తనకు ఈరోజు జన్మభూమిలో సత్కారం జరగడం అదృష్టమని పేర్కొన్నారు. రాజకీయాల్లో పెనుతుఫాన్‌గా వచ్చిన రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన అభివృద్ధి ఫలాలను ఇప్పుడు చూస్తున్నామని, ఇప్పుడు ఆయన పేరుతోనే కునారిల్లుతున్న నాటకరంగాన్ని పునరుజ్జీవింపజేసే కృషి



'స్వర్ణకమలాలు' నాటికలో సన్నివేశం

సాగటం గొప్ప విషయమన్నారు. దశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఉన్న తనకు వైఎస్సార్ అవార్డుతో సత్కారం చేయటంపై కొండా శివారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కొల్లిపర శ్రీకళానిలయం వ్యవస్థాపకుడు బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి బాలల నాటక పరిషత్‌లకు ప్రభుత్వ సాయం అందేలా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కొల్లిపర ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ కేహెచ్ నిర్మల, వైఎస్సార్ సీపీ నేత బూరెల దుర్గాప్రసాద్, డాక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు సభా నిర్వహణ చేయగా, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, ఆరాధ్యుల కన్నా, గరికపాటి సుబ్బారావు, పిట్టు కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

#### ఆకట్టుకున్న ప్రదర్శనలు

తొలుత హర్ష క్రియేషన్స్, విజయవాడ వారి 'స్వర్ణకమలాలు' నాటికను ప్రదర్శించారు. మునిపల్లె విద్యాధర్ రచించిన నాటకానికి కత్తి శ్యామ్‌ప్రసాద్ దర్శకత్వం వహించారు. అనంతరం గురజా మనస్వీచే భరతనాట్య ప్రదర్శన, చల్లా యామిని శిష్యబృందంచే మంత్రి ఆర్‌కే రోజాపై పాటకు నృత్యం, ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందంచే సీఎం జగన్ పాలనపై నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సభికుల అభినందనలు అందుకున్నాయి.




## 'ఆర్ట్'బీట్ జగన్

- అభిమానం చాటుతున్న పెయింటర్
- గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ చిత్రాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆకర్షితుడైన అభిమాని విజయ్‌కుమార్ తన సొంత ఖర్చులతో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఊరూరా ప్రచారం చేయాలని తలంచాడు. అనుకున్నదే తడవుగా వీధుల్లో గోడలపై జగనన్న చిత్రంతో పాటు జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ అంటూ పెయింటింగ్స్ వేస్తున్నాడు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం ఈదుమూడికి చెందిన విజయ్‌కుమార్ తన ఆర్ట్, హార్ట్ బీట్ జగనన్నేనని గుండె లోతుల్లో దాగున్న అభిమానాన్ని ఇలా చాటుకుంటున్నాడు. స్వతహాగా పెయింటర్ అయిన ఆయన చీమకుర్తి నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాడు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ గోడలపై పెయింట్లు వేస్తానని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని విజయ్‌కుమార్ చెబుతున్నాడు.

– చీరాల రూరల్

### జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



**పెదకాకాని:** జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ జగన్మోహనరావు చెప్పారు. పెదకాకాని మండలం, నంబూరులో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, అంగన్‌వాడీ సెంటర్లు, జగనన్న కాలనీలను జెడ్పీ సీఈఓ సందర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని గృహ లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల నిర్వహణపై అధికారులతో చర్చించారు. అంగన్‌వాడీ సెంటర్ల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వి.మల్లేశ్వరరావు, తహసీల్దార్ పి.రత్నం పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 43,580 టిడ్కో గృహాలు అందజేత

**నరసరావుపేటలోని గృహాలను సందర్శించిన టిడ్కో కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రసన్నకుమార్**



టిడ్కో గృహాల వద్ద మాట్లాడుతున్న ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు

**నరసరావుపేట:** రాష్ట్రంలోని 23 పట్టణాల్లో 43,580 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసినట్టు టిడ్కో కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జె.ప్రసన్నకుమార్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి నరసరావుపేట చిలకలూరిపేటరోడ్డులోని టిడ్కో గృహాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న మౌలిక వసతులపై టిడ్కో, గృహశాఖ, విద్యుత్, పురపాలక శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో మరో 20 పట్టణాలను గుర్తించి టిడ్కో గృహాలను పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి అందజేసేందుకు నిర్ణయించామన్నారు. నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో 1,504 గృహాలకు రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి అందజేయబోతున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు రుణసదుపాయం కోసం బ్యాంకు లింకేజ్ కోసం మాట్లాడామన్నారు. వచ్చే మే 15 నాటికి మౌలిక వసతులు అన్నీ పూర్తిచేసిన అనంతరం మంచిరోజున గృహప్రవేశాలు చేయిస్తామని వివరించారు. పాదయాత్రలో చేసిన వాగ్దానం మేరకు సీఎం జగన్ బీ కేటగిరీ గృహాలకు వసూలు చేసిన రూ.50వేల నుంచి రూ.25వేలు సబ్సిడీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ గృహాలకు రిజిస్ట్రేషన్ జరగాలంటే రూ.50వేలు నుంచి రూ.75వేలు ఖర్చు అవుతుండగా ఈ 1,504 గృహాలకు పైసా ఖర్చులు లేకుండా పూర్తి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామన్నారు. దీనికోసం ప్రభుత్వం రూ.1,200కోట్లు భరిస్తుందన్నారు. చంద్రబాబు సెల్ఫీలతో తామే కట్టించామని చెబుతున్నారని, అదే నిజమైతే వారెందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు.

# పెద్ద పులుల సంచారంపై ఆరా



పెద్దపులి దాడిలో చనిపోయిన ఆవును పరిశీలించిన పశువైద్యాధికారులు

**దుర్గి:** గజాపురం అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం పెద్ద పులులు ఆవుపై దాడి చేసి చంపివేసిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీశారు. బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులు రెవెన్యూ, పంచాయతీ, అటవీ శాఖ ఉన్నతాధికారులు, కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్, దుర్గి ఎస్సై కె.సతీష్ ఘటన స్థలాన్ని సందర్శించి స్థానికుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. పశుసంవర్థక శాఖ అధికారులు పంచనామా నిర్వహించి రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి దీపాలు అమర్చాలని విద్యుత్ ఏఈ రాంబాబును అటవీ అధికారులు కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

**యద్దనపూడి:** బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను పర్చూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. చిలకలూరిపేటలోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుతున్న బాలిక కనబడటం లేదని ఆమె తల్లిదండ్రులు ఈ నెల 19న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మార్టూరు సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్ సూచనలతో పర్చూరు ఎస్ఐ ఎస్‌సీ ప్రసాద్ సిబ్బంది సాయంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ నెల 22న శనివారం బాలిక ఎక్కడ ఉన్నది గుర్తించారు. ఆమెను కిడ్నాప్‌చేసి నిందితుడు మున్నంగి భుజంగరావు లైంగిక దాడి చేసినట్టు బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తేల్చారు. నిందితుడు మున్నంగి భుజంగరావును బుధవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని చార్జి షీట్ దాఖలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎ. శ్రీనివాసరావు, మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్ఐ ఎస్‌సీ ప్రసాద్, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

# కౌన్సిలర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

- హతుడు, నిందితులూ టీడీపీవారే
- ఫ్లెక్సీల ఏర్పాటుతో గొడవలు ప్రారంభం
- రాజకీయంగా ఎదుగుతున్నాడన్న అక్కసుతోనే హత్య
- రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ



నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

**రేపల్లె:** కౌన్సిలర్ రామకృష్ణ హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక పట్టణ సర్కిల్ కార్యాలయంలో బుధవారం కేసు వివరాలను డీఎస్పీ వివరించారు. ఆయన కథనం ప్రకారం.. రేపల్లె 14వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అన్నె రామకృష్ణ(49)కు పరిటాల యువసేన నాయకుడు, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు దండమూడి వెంకట ధరణీకుమార్ అనుచరులకు గతంలో ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో గొడవలు జరిగాయి. ధరణీకుమార్ అనుచరులు సోషల్ మీడియాలోనూ రామకృష్ణపై అసభ్య పోస్టులు పెట్టారు. రాజకీయంగా తనకంటే ఎదుగుతున్నాడనే అక్కసుతో దండమూడి ధరణీకుమార్ రామకృష్ణ హత్యకు ప్రణాళిక రచించారు. ధరణీకుమార్ ప్రోద్బలంతో అతని అనుచరులు ఈ నెల 17వతేదీ రాత్రి ఇసుకపల్లి రోడ్డులో ఏడీబీ బ్యాంక్ సమీపంలో రామకృష్ణపై రాడ్‌లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. రామకృష్ణ భార్య సుధ ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేశారు. నిందితులైన నగరం మండలం సజ్జావారిపాలెంకు చెందిన దండమూడి వెంకట ధరణీకుమార్, రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన యలవర్తి రాజేష్, మోర్తోటకు చెందిన ఉప్పల యోగేంద్ర, చంద్రమౌళిపురానికి చెందిన రేపల్లె పాపారావు, సింగుపాలెంకు చెందిన దివి శివ వృద్ధి, నల్లూరుపాలెంకు చెందిన తుమ్మల కృష్ణచైతన్య, రేపల్లె పట్టణం 14వ వార్డుకు చెందిన కందేపి పవన్‌బాబును పెనుమూడి చెక్‌పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడికి ఉపయోగించిన ఇనుపరాడ్‌లను, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో పట్టణ సీఐ విజయ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పార్శిల్ ఆఫీసులో రంగురాళ్ల స్వాధీనం

**28 డబ్బాల్లో వెయ్యి కిలోల రాళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**పిడుగురాళ్ల :** ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పోలీసులు రంగురాళ్లను స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి దాచేపల్లి మండలం శంకరాపురం గ్రామానికి చెందిన కొండ నాయక్ అనే వ్యక్తి 28 పెద్ద ప్లాస్టిక్ డబ్బాల్లో రంగురాళ్లను తీసుకొచ్చాడు. అయితే ట్రాన్స్‌పోర్టు కార్యాలయ ఏజెంట్ కిరణ్.. బిల్లులు ఉంటేనే ఇక్కడ నుంచి సరుకులు రవాణా చేస్తామని చెప్పటంతో కొండా నాయక్ బిల్లులు తీసుకొని వస్తానని వెళ్లాడు. ఈ లోగా అనుమానం వచ్చిన కిరణ్.. ఆ డబ్బాలను తెరిచి చూశాడు. అందులో రంగురాళ్లు కనిపించటంతో వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు రంగంలోకి దిగి 28 డబ్బాల్లో సుమారు వెయ్యి కిలోల రంగురాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు కొండ నాయక్‌ను చాకచక్యంగా పార్శిల్ కార్యాలయానికి రప్పించి అదుపులోకి తీసుకున్నారు. ఈ రంగురాళ్లను పిడుగురాళ్ల పార్శిల్ ఆఫీసు నుంచి హైదరాబాద్‌కు పంపించేలా ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. రంగురాళ్ల నాణ్యతను బట్టి కిలో రూ.400 నుంచి రూ.2 వేల దాకా పలుకుతాయని సమాచారం.